www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
18 డిసెంబర్ 2023
సంపుటి : 02, సంచిక: 57

# విశాల భారతి
తెలుగు దినపత్రిక



# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- అర్వింద్ కుమార్ పై వేటు
- ప్రాధాన్యత లేని శాఖ కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతి కుమారి

**విశాలభారతి,హైదరాబాద్:**

తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఐఏఎస్ అరవింద్ కుమార్ పై వేటు వేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా అరవింద్ కుమార్ ను నియిమించింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో ఎలక్షన్ కమిషన్ బదిలీ చేసిన శ్రీనివాస్ రాజు, శ్రీదేవిలకు మిగతా 2లో

# అప్పులు, ఆరు పథకాల అమలు..

# గట్టెక్కించే ప్లాన్ చెప్పండి



## అప్పుల్లో కూరుకుపోకుండా పథకాల అమలు..

తెలంగాణ ఇప్పటికే పలు ఆర్థిక సమస్యల్లో ఉన్న నేపథ్యంలో.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి కత్తి మీద సామే కానుంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు పెద్ద మొత్తంలో నిధులు అవసరం.. అయితే రాష్ట్రాన్ని అప్పులో కూరుకుపోకుండా పథకాలను అమలుచేయడం కోసం సీఎం రేవంత్ రెడ్డి పలువురు ఆర్థిక వేత్తల సూచనలు సలహాలు తీసుకుంటున్నారని అధికార వర్గాలు చెప్తున్నాయి. రఘురామ్ రాజన్ రాకతో ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క , శాసన సభ వ్యవహారాలు, ఐటీ శాఖల మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం కార్యదర్శి శేషాద్రి తదితరులు ఉన్నారు.

- ఆర్బీఐ మాజీ గవర్నర్ ను కోరిన సీఎం
- రేవంత్‌రెడ్డితో భేటీ అయిన రఘురామ్‌రాజన్
- రూ.5 వేల కోట్ల అప్పులు, 'గ్యారంటీల' అమలుపై చర్చ
- విద్య, వైద్యానికి ప్రియారిటీ ఇవ్వాలని రాజన్ సూచన
- రఘురామ్‌రాకతో ఆనందం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ప్రపంచ ప్రఖ్యాత ఆర్థికవేత్త , రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ఆదివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. కొత్తగా కొలువు తీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించడంతో హైదరాబాద్‌కు విచ్చేసిన రాజన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మాజీ ముఖ్య సలహాదారుగా కూడా పనిచేసిన రఘురామ్ రాజన్.. సీఎం రేవంత్ రెడ్డితో తన అనుభవాలను పంచుకున్నారు. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు రఘురామ్ రాజన్ ప్రస్తుతం రాష్ట్ర ఖజానాపై ఏకంగా రూ. 5,00,000 కోట్లు అప్పులుగా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి రఘురామ్ రాజన్‌కు వివరించారు.

మిగతా 2లో

## డిసెంబర్21న కలెక్టర్లతో సీఎం మీటింగ్ రేవంత్ రెడ్డి మరో కీలక నిర్ణయం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి కలెక్టర్లంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. కొత్త రేషన్ కార్డులు, మహాలక్ష్మి పథకం అమలు, భూరికార్డుల సమస్యలు, కౌలు రైతుల గుర్తింపు సహా మరికొన్ని అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత కలెక్టర్లతో రేవంత్ రెడ్డి సమావేశం కావాలని నిర్ణయించడం ఇదే మొదటిసారి. దీంతో కలెక్టర్లంతా పూర్తి అప్రమత్తంగా సమావేశానికి హాజరు కానున్నారు.

**ఆరు గ్యారంటీల అమలుపై నజర్**

అధికారంలోకి వచ్చి రోజులు గడుస్తుండటంతో వివిధ శాఖలలోని వాస్తవ పరిస్థితులపై ఓ అంచనాకు వచ్చిన రేవంత్ రెడ్డి ఇక హామీల అమలుపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజులకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ బీమా అమలు పరచగా మిగతా హామీల దిశగా ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ధరణిని ప్రక్షాళన చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన నేపథ్యలో ఇటీవల ధరణి లోటుపాట్లపై అధికారులు, నిపుణులు, ఉద్యోగ సంఘాలతో సీఎం కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. ప్రజావాణి వస్తున్న ఫిర్యాదుల్లో భూసమస్యలే అధికంగా ఉండటంతో జిల్లా స్థాయిలో పరిష్కారం కోసం సీఎం కలెక్టర్లకు ఏదైనా సూచనలు చేస్తారా అనేది ఆసక్తిగా మారింది. అలాగే గత ప్రభుత్వంలో రేషన్ కార్డులు జారీ జరగకపోవడంతో పెద్ద సంఖ్యలో కొత్తరేషన్ కార్డు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. అర్హులైన వారికి త్వరలోనే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఇటీవలే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఆలాగే రైతుబంధు విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. సమయం లేకపోవడంతో యాసంగికి పాతపద్ధతిలోనే రైతుల ఖాతాలో నగదు జమ చేసిన ప్రభుత్వం ఆతర్వాత రాబోయే వర్షాకాలం వరకు విధివిధానాలు రూపొందించాలని భావిస్తోంది. ఈ మేరకు ఈ విషయంలో కౌలు రైతులను గుర్తించడం ప్రభుత్వం ముందు ఉన్న అతి పెద్ద టాస్క్. ఈ అంశంపై కూడా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేసే ఛాన్స్ కనిపిస్తోంది.

# కక్ష సాధింపులుండవ్

- తెలంగాణ అభివృద్ధిపైనే ఫోకస్
- ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నడుపుతాం
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- సిద్ధిపేటలో మీడియాతో పలు కామెంట్స్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



కాంగ్రెస్ పాలనలో ఎవరిపైనా కక్ష సాధింపులుండవని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఉద్ఘాటించారు. సిద్దిపేటలో మంత్రిని కాంగ్రెస్ కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడారు. విపక్షాల తీరుపై ఆయన్‌ఫైర్‌అయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని, వారి మాటలు ఒకలా, చేతలు మరోలా ఉంటాయని విమర్శించారు. బీజేపీ లీడర్లు తొమ్మిదేండ్లు బీఆర్ఎస్ తో చెట్టాపట్టాలేసుకుని మిగతా 2లో

# పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం బాధాకరం

కుట్ర వెనుక నిజాలు త్వరలో బయటపెడ్తం • ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



పార్లమెంట్ లో భద్రతా వైఫల్యం ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ తొలిసారి స్పందించారు. ఇది చాలా సీరియస్ అంశం అన్నారు. దీనిపై అనవసర రాద్ధాంతం చేయొద్దని ప్రతిపక్షాలకు కోరారు. దైనిక్ జాగరణ్ వార్త పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధానిపై విధంగా స్పందించారు. పార్లమెంట్ లో భద్రతా వైఫల్యం చోటు చేసుకోవడం బాధించిందన్నారు. దీన్ని తక్కువగా అంచనా వేయకూడదని అలాగే ఇలాంటివి పునరావృతం కాకుండా మూలాల్లోకి వెళ్ళి పరిష్కారం కనుగొనాలి. ఘటన అనంతరం స్పీకర్ ఓం బిర్లా విచారణకు ఆదేశించారని గుర్తు చేశారు. ఈ కుట్ర వెనుక నిందితుల లక్ష్యాలు ఏంటో అన్ని త్వరలోనే బయట పడతాయన్నారు. ఇటీవల బీజేపీ విజయం సాధించిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాలకు కొత్త వ్యక్తులను సీఎంగా ఎంపిక చేయడం పట్ల స్పందిస్తూ వారు కొత్తవారేం కాదన్నారు. ఎంతో కాలంగా ప్రజల పక్షం వైపు పని చేస్తున్నారని తెలిపారు.

# పార్లమెంటుపై దాడి తీవ్రమైన అంశం

ఈ ఘటనపై సమగ్ర విచారణ జరగాలి • కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**



పార్లమెంటు మీద దాడి తీవ్రమైన అంశమని కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఢిల్లీకి బయల్దేరారు. విపక్ష పార్టీల కూటమి 'ఇండియా' సమావేశంలో పాల్గొనేందుకు ఆమె దేశ రాజధాని నగరానికి పయనమయ్యారు. మిగతా 2లో

# నేడు నల్గొండ జిల్లాకు మంత్రి కోమటిరెడ్డి రాక

- మంత్రి నివాసంలో ప్రజలను కలువనున్న వెంకట్‌రెడ్డి
- ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో సమావేశం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం నల్గొండ జిల్లాకు రానున్నారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారి కోమటిరెడ్డి జిల్లాకు వస్తున్నారని మంత్రి కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించాయి. కోమటిరెడ్డి ముందుగా నల్గొండ పట్టణంలోని ఆయన నివాసంలో జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశం, స్థానిక ప్రజలను కలుసుకోనున్నారు. అనంతరం కలెక్టరేట్ లో జిల్లాలో కొనసాగుతున్న వడ్ల కొనుగోళ్ల తీరు, భవిష్యత్ లో అనుసరించాల్సిన ప్రభుత్వ విధానం, మున్సిపాలిటీలలో తాగునీటి కల్పన, నిరంతర విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, పక్కాగా విద్యుత్ సరఫరాలో అనుసరించాల్సిన వ్యూహాలపై కలెక్టర్, ఇతర విభాగాల ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో ఇష్టాగోష్టి నిర్వహించనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.



# మేడిగడ్డపై పూర్తి వివరాలివ్వండి..

**అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం**

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

కుంగిన మేడిగడ్డ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని నీటిపారుదల శాఖ అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం తన నివాసంలో నీటిపారుదల శాఖ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

ముగ్గురు అయ్యప్ప భక్తుల మరణం..

2లో



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం వారి నివాసంలో కలిసి జోగులాంబ అమ్మవారి ఆశీర్వచనాలు అందించిన అలంపూర్ జోగులాంబ సమేత బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు, అర్చక బృందం. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధికి చొరవ చూపాలని సీఎంకు వినతిపత్రం సమర్పించారు. అర్చకులతో పాటు అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నేత సంపత్‌కుమార్ ఉన్నారు.

– విశాల భారతి, స్టేట్‌బ్యూరో



# గట్టెక్కించే ప్లాన్ చెప్పండి

మొదటిపేజీ తరువాయి

వీటిని అధిగమించడం ఒక సవాల్ గా మారిందని, ఇదే సమయంలో తమ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలంటే తలకు మించిన భారం అవుతుందని తెలిపారు.వీటినుంచిగట్టెక్కేందుకువిలువైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా కోరారు రేవంత్ రెడ్డి. చర్చలో భాగంగా రఘురామ్ రాజన్ ఉచితాలపై కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. పేదలకు ఇవ్వడం మంచిదేనని, అయితే వాటిని ఎక్కువగా పౌష్టికాహారం, వైద్యం, విద్యా రంగాలపై ఖర్చు చేస్తే బావుంటుందని సూచించినట్లు తెలుస్తోంది.

### భారీగా తగ్గిన రెవెన్యూ

2023- 24 చివరి నాటికి తెలంగాణ అప్పులు జీఎస్ డీపీలో 23.8 శాతంగా ఉండనున్నాయి. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుకు రూ.1.29 లక్షల కోట్లు అవసరం అనేది అంచనా. 202324లో తెలంగాణ ప్రభుత్వం రూ.38,235 కోట్లు అప్పులు తెచ్చుకునే వీలు ఉండగా.. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు రూ.33,378 కోట్ల మేర అప్పులు తెచ్చినట్లు రాష్ట్ర గణాంకాలు చెబుతున్నాయి. గతేడాదితో పోలిస్తే తెలంగాణ రెవెన్యూ క్రమంగా తగ్గుతూ వస్తుంది. 2023- 24 బడ్జెట్ ప్రకారం రూ.2.16 లక్షల కోట్ల మేర రెవెన్యూ వస్తుందని అంచనా వేయగా.. ఇప్పటి వరకు వచ్చింది కేవలం లక్షల కోట్లు మాత్రమే. కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలోనూ ఇప్పటికే రాష్ట్రానికి 50 శాతం వచ్చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వాన్ని నడపటం కాంగ్రెస్ పార్టీకి పెద్ద సవాల్ గా మారింది.

### రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలుపై చర్చ..

తెలంగాణ ఇప్పటికే ఆర్థిక సమస్యల్లో ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆరు గ్యారంటీల అమలు కత్తిమీద సామే కానుంది. అప్పుల్లో కూరుకుపోకుండా పథకాలు అమలుచేయడం సీఎం రేవంత్ రెడ్డికి సవాల్‌కానుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఆర్థిక అభివృద్ధికి అనుసరించాల్సిన విధి విధానాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేందుకు రఘురామ్ రాజన్ సీఎం రేవంత్ రెడ్డికి పలు సలహాలు, సూచనలు అందిచినట్లు తెలుస్తోంది.

# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది.
మున్సిపల్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీగా దాన కిషోర్
జీఏడీ కార్యదర్శిగా రాహుల్ బొజ్జా
వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ గా శ్రీదేవి
మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శిగా వాకాటి అరుణ
అటవీ పర్యావరణశాఖ కార్యదర్శిగా వాణి ప్రసాద్
ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల డైరెక్టర్ గా ఆర్ వి కర్ణన్
వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శిగా క్రిస్టినా
విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా వెంకటేశం
హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండీగా సుదర్శన్ రెడ్డి
రోడ్లు, భవనాలతో పాటు రవాణా శాఖ కార్యదర్శిగా శ్రీనివాస్ రాజు
విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా అరవింద్ కుమార్
కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ గా బుర్రా వెంకటేశంకు అడిషనల్ బాధ్యతలు
ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ గా వాని ప్రసాద్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

## ముగ్గురు అయ్యప్ప భక్తుల మరణం..



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

మద్రాస్ బైపాస్ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన ఐదుగురు అయ్యప్ప భక్తులు ఓ కారులో కేరళలోని శబరిమలకు వెళ్లారు. అక్కడ అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం అదే కారులో తిరుగు ప్రయాణం ప్రారంభించారు. ఆ వాహనం ఆదివారం మధ్యాహ్నం సమయంలో తమిళనాడులోని మద్రాస్ బైపాస్ రోడ్డుకు చేరుకుంది. ఈ క్రమంలో ఆ కారు అదుపు తప్పి డివైడర్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అయ్యప్ప దీక్షాపరులు అక్కడికక్కడే మరణించారు. వీరిని సుబ్బయ్య నాయుడు, నరసాంబయ్య, రాజుగా గుర్తించారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందగానే తమిళనాడు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను దగ్గరలో ఉన్న హాస్పిటల్ కు తరలించారు. అలాగే మృతదేహాలను కూడా గవర్నమెంట్ హాస్పిటల్ కు తీసుకెళ్లారు. ఈ ప్రమాదంపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఈ ఘటనతో కమలాపురం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# మేడిగడ్డపై పూర్తి వివరాలివ్వండి..

మొదటిపేజీ తరువాయి

నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నీటిపారుదల రంగం పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా నిర్మించిన ప్రాజెక్టుల ఖర్చులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలన్నారు. ఇతర రాష్ట్రాలతో జల వివాదాలకు సంబంధించి కృష్ణా ట్రిబ్యునల్ వద్ద వినిపించాల్సిన వాదనలు, ముందు ముందు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. యాసంగి పంటలకు నీళ్లిచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నీటి లభ్యత, ఇతర అంశాలపై పలు సూచనలు చేశారు. అంతర్రాష్ట్ర జలవివాదాలను త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించి వీలైనంత త్వరగా పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు సీఎం. ఈ సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈఎన్ సీ మురళీధర్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కక్ష సాధింపులుండవ్

మొదటిపేజీ తరువాయి

తిరిగారని , ఇప్పుడెందుకు బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై విచారణ చేపడతామని మేనిఫెస్టోలో పెట్టామని, ఆ మేరకు మాట నిలుపుకుంటామని శ్రీధర్ బాబు తెలిపారు. మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టుల్లో లోపాలపైనా దర్యాప్తు జరిపిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్ కు ఓటేశారని, వారు కోరుకున్న మార్పును అన్ని రంగాల్లో చూపిస్తామని పేర్కొన్నారు. పలు రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉండేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. ప్రజలు తమ వాణిని నిర్భయంగా ప్రభుత్వానికి వినిపించవచ్చని అన్నారు. బీఆర్ఎస్ పాలనలోని ప్రజాహిత కార్యక్రమాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని ఉద్ఘాటించారు. నిరుద్యోగ యువతకు చేయూతనిచ్చేలా ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించామని మంత్రి చెప్పారు. త్వరలోనే నిర్దిష్ట కాలావధితో జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం అందరిని కలుపుకుని ముందుకు వెళ్తుందన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం బడ్జెట్ రూపొందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. అంతకుముందు ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ తో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క తోపాటు మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి అంశాలపై చర్చించారు.

# సుప్రీం నిర్ణయం దేవుడి నిర్ణయమేమీ కాదు

- ఆర్టికల్ 370పై పునరుద్ధరణపై ఇంకా ఆశలున్నాయి
- పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ

విశాలభారతి,నేషనల్ బ్యూరో:

జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్రి కల్పించే 370వ అధికరణను కేంద్రం రద్దు చేయడాన్ని సుప్రీంకోర్టు సమర్థిస్తూ ఇటీవల ఇచ్చిన చరిత్రాత్మక తీర్పుపై జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ నిశిత విమర్శ చేశారు. సుప్రీంకోర్టు నిర్ణయం దేవుడి తీర్పేమీ కాదని అన్నారు. తాము ఇంకా ఆశ వదులుకోలేదని, తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. జమ్మూకశ్మీర్ నుంచి లద్దాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా విభజిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం చట్టబద్ధతను తాము సమర్థిస్తున్నట్టు సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఈనెల 11న ఇచ్చిన తీర్పులో పేర్కొంది. 2024 సెప్టెంబర్ 30లోగా జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరిపాలని భారత ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. సాధ్యమైనంత త్వరగా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రప్రతిపత్తిని పునరుద్ధరించాలని పేర్కొంది. దీనిపై మెహబూబా ముఫ్తీ ఆదివారంనాడు స్పందిస్తూ, కోర్టు నిర్ణయాన్ని దేవుడి తీర్పుతో సమానంగా చూడలేమన్నారు.



"మేము ఇంకా అశ వదులుకోలేదు. జమ్మూకశ్మీర్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. ఎన్నో కష్టనష్టాలు చవిచూశారు. వాళ్లు మమ్మల్ని ఆశవదులుకోమంటున్నారు. ఓటమిని ఒప్పకుని ఇంట్లో కూర్చోమంటున్నారు. ఇది ఎన్నటికీ జరగదు. మేము చివరి వరకూ పోరాడతాం. సుప్రీంకోర్టు తీర్పు దేవుడి తీర్పు కాదు. ఇదే సుప్రీంకోర్టు గతంలో రాజ్యాంగ సభ సిఫారసు లేకుండా 370వ అధికరణను తొలగించలేమని చెప్పింది. వాళ్లు కూడా జడ్జీలే. ఇవాళ వేరే జడ్జీలు తీర్పు చెపపారు. దీనిని దేవుడు తీర్పుగా మేము భావించలేం. మా పోరాటం కొనసాగుతుంది అని మెహబూబా ముఫ్తీ చెప్పారు

# పార్లమెంటుపై దాడి తీవ్రమైన అంశం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై దీదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది చాలా తీవ్రమైన అంశం, పెద్ద తప్పిదమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి ఇప్పటికే అంగీకరించారన్న దీదీ.. ఈ ఘటనపై విచారణ జరగనివ్వండి అని వ్యాఖ్యానించారు.
ఆరోగ్య కేంద్రాలకు కాషాయ రంగు వేయాలన్న కేంద్రం ఆదేశాన్ని మరోసారి ప్రస్తావిస్తూ ప్రజలు ఏం తినాలో, ఏం ధరించాలనే అంశాలను కూడా నిర్ణయించడానికి భాజపా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. మరోవైపు, డిసెంబర్ 20న మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం కానున్నారు. బెంగాల్‌కు రావాల్సిన బకాయి నిధులను విడుదల చేయాలని ఈ సందర్భంగా ప్రధానిని కోరనున్నారు.

# మంత్రినైనా మీ బిడ్డనే..

## మంత్రి సీతక్క

విశాలభారతి,స్టేట్ బ్యూరో:



తెలంగాణ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ములుగు జిల్లా కు వచ్చిన సీతక్కకు ఘనస్వాగతం లభించింది. పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం శాఖల మంత్రిగా సీతక్క ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో రాష్ట్ర మంత్రిగా ములుగు జిల్లాకు వెళ్లిన సీతక్కకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి ములుగు నియోజక వర్గం చేరుకున్న మంత్రి సీతక్కకు అడుగడుగున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ములుగు జిల్లాలోని మహమ్మద్ గౌస్ పల్లి వద్ద సీతక్కకు భారీ గజమాల వేసి, నృత్యాలతో ఘన స్వాగతం పలికారు.

**ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటాను..**

భారీ మెజారిటీతో తనను గెలిపించి, అత్యున్నత హోదా మంత్రిని చేసిన ములుగు ప్రజలందరికి రుణపడి ఉంటానని మంత్రి సీతక్క అన్నారు. ములుగు నియోజకవర్గ ప్రజల అభిమానాన్ని ఎప్పుడు మరిచిపోనని అన్నారు. మాట మీద నిలబడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, సోనియమ్మ ఇచ్చిన తెలంగాణలో పది సంవత్సరాల తరువాత ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో, నియోజక వర్గంలో కీలక పాత్ర పోషించి నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. అక్కడి నుంచి గట్టమ్మ దేవాలయం వరకు దాదాపు పదిహేను కిలోమీటర్ల మేర కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. గట్టమ్మను దర్శించుకని మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి సీతక్క మేడారం వెళ్లారు. మేడారం జాతర నిధుల కేటాయింపులపై ఆరోపణలు వస్తున్నాయని.. ఇప్పుడు ఇచ్చిన 75 కోట్ల నిధులు గత ప్రభుత్వం ప్రతిపాదనలు చేసినవేనని సీతక్క తెలిపారు. మేడారంలో త్వరలో నిర్వహించబోయే తెలంగాణ కుంభమేళా జాతరపై అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించనున్నారు. తాను ఏ స్థాయిలో ఉన్నా ములుగు ఆడబిడ్డనేనని, నిరంతరం అభివృద్ధి కోసం పాటుపడతా అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. ఆరు గ్యారంటీలలో ఇప్పటికే రెండు గ్యారంటీలపై సంతకం చేశాం, త్వరలో మిగతా గ్యారంటీలను అమలు చేసేందుకు సిద్ధమన్నారు.

# ఏపీని వైసీపీ నాశనం చేస్తోంది

- కేంద్రం ఎన్నో నిధులిచ్చినా దుర్వినియోగమే
- మోడీ అభివృద్ధిని జనాలకు వివరిస్తున్నాం
- ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి



విశాలభారతి,స్టేట్ బ్యూరో:

రాష్ట్ర వ్యాప్త పర్యటన ద్వారా తొమ్మిదిన్నరేళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ "జిల్లా వాసుల కోసం 216 జాతీయ రహదారి రూ. 316 కోట్లతో అభివృద్ధి చేశాం. జిల్లాలో 75 కోట్లతో పలు రైల్వే స్టేషన్ల అభివృద్ధి చేశాం. కోటిపల్లి నర్సాపురం రైల్వే లైన్ పనులకు 75 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చింది.. కానీ ఏపీ ప్రభుత్వ వాటా 25 శాతం నిధులు విడుదల కాలేదు. రూ. 330 కోట్ల కేంద్ర నిధులతో నర్సాపురం మండలం సరిపల్లి గ్రామంలో ఆక్వా పార్క్ ఏర్పాటు చేశాం. జిల్లాకు లక్షా 5 వేల ఇళ్లను కేంద్రం మంజూరు చేస్తే ఎన్ని ఇళ్లు నిర్మించారో జగన్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. జగన్ ప్రభుత్వం రూ .170 కోట్లకు టిడ్కో గృహాలను తాకట్టు పెట్టి పేదలకు నోటీసులు ఇవ్వడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వ చేస్తున్న ఆన్యాయాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు. సాగు నీరు కాల్వల అభివృద్ధికి కేంద్ర నిధులు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ రైతులకు అన్యాయం చేస్తోంది. ఆడుదాం ఆంధ్ర పథకం కాదు.. ఆంధ్ర రాష్ట్రంతో వైసీపీ ప్రభుత్వం ఆడుకుంటోంది. రాష్ట్రంలో వైసీపీ నిరంకుసత్వ పరిపాలన సాగుతోందిని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు.

# క్రైమ్ చేయాలంటే వణుకు పుట్టాలి

- ఒకరికి శిక్ష పడితేనే 10 మందికి భయం పుడుతుంది
- నగరంలోకి డ్రగ్స్ ను రానివ్వొద్దు
- హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

విశాలభారతి,హైదరాబాద్:

ఒక నేరస్థుడికి శిక్ష పడితే.. నేరం చేయాలనుకునే 100 మందిలో భయం వస్తుందని హైదరాబాద్ సీపీ కొత్త కోట శ్రీనివాసరెడ్డి అన్నారు. కమిషనరేట్‌లోని ఉన్నతాధికారులు, ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బందితో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఠాణాలకు వచ్చి ఫిర్యాదు చేసే వారిపట్ల గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరపాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని, ఇందుకోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలు నగరంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సీపీ దిశానిర్దేశం చేశారు. సైబర్ నేరాల దర్యాప్తులో దేశంలోనే హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని.. ఇప్పటికే మన వద్ద ఉన్న వ్యవస్థను ఉపయోగించుకుని కేసులు దర్యాప్తును మరింత వేగవంతం చేయాలన్నారు. రికవరీ రేటును మరింత పెంచాలని సిబ్బందిని సీపీ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ రహిత తెలంగాణే ధ్యేయంగా టీఎస్ న్యాబ్




పనిచేస్తుందని డైరెక్టర్ సందీప్ శాండిల్య పేర్కొన్నారు. టీఎస్ న్యాబ్ వ్యవస్థ, పనితీరుపై ఆయన ప్రకటన విడుదల చేశారు. "ఈ నెల 12న టీఎస్ న్యాబ్ డైరెక్టర్‌గా నియమితులయ్యాను. ముఖ్యమంత్రి వద్ద రెండు గంటపాటు టీఎస్ న్యాబ్ వ్యవస్థ, డ్రగ్స్ నియంత్రణకు చేసిన కృషిపై వివరించాం. టీఎస్ న్యాబ్.. గ్రే హౌండ్స్, అక్టోపస్ తరహా సంస్థలా మారాలి. డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలి. పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు చూడాలి. విద్యాసంస్థలు, ఐటీ, ఫిల్మ్ ఇండస్ట్రీ, బార్లు, పబ్‌లు, రేవ్ పార్టీలు, రిసార్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే 87126 71111 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి" అని శాండిల్య సూచించారు.

# పీవీపై హరీశ్‌రావు ప్రేమ ఆశ్చర్యం..

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- తప్పడు విమర్శలు మానుకోవాలని హితవు

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:



పీవీ నర్సింహారావు కాంగ్రెస్ వాదీ అని.. శనివారం మాజీ మంత్రి , సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అసెంబ్లీలో ప్రేమ వలకబోసి మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పీవీ సీఎంగా, పీఎంగా పనిచేశారని, ఆయన ఏ పదవీ చేపట్టిన ఆ పదవీకి వన్నెతెచ్చారని కొనియాడారు. పీవీ అంతిమ యాత్ర హైదరాబాద్‌లో చేపట్టాలని కుటుంబసభ్యులే కోరారని, అన్ని లాంఛనాలతో గౌరవ వందనాలతో చేశారన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం బాధాకరమన్నారు.


**నిన్న సభలో చర్చలు చూస్తుంటే..**

ఉద్యమ పార్టీ అనిచెప్పుకునే బీఆర్ఎస్ నేతలు.. ఏపీ అక్రమంగా నీటిని తరలించుకుపోతున్న మౌనంగా ఉన్నారని జీవన్ రెడ్డి విమర్శించారు. భద్రాచలంకు చెందిన 7 మండలాలు కోల్పోయామని, స్వార్థ పూరిత రాజకీయాల కోసం ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు ఈ విధంగా మాట్లాడుతున్నారని అన్నారు. సీలేరు పవర్ ప్రాజెక్టు కోల్పోవడానికి కేసీఆరే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ ద్వారా 4వేల మెగా వాట్ల విద్యుత్ పొందే హక్కు ఉందన్నారు. కానీ 2600 మెట్ల వాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడంలో కేంద్రంపై ఒత్తిడి తేలేకపోయారని ఆరోపించారు. ఐటీఐఆర్ తేవడంలో విఫలమయ్యారని, విభజన చట్టం హక్కులను సాధించడంలో ఫెయిలయ్యారన్నారు. విమర్శలు చేయడం బంద్ చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును టూరిస్ట్ స్పాట్‌గా చేసిందే బీఆర్ఎస్ అని, కాళేశ్వరం అవినీతి బయటపెడతామన్నారు. సీఎం రేవంత్ తీసుకునే నిర్ణయం శుభపరిణామమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారన్నారు.

# అటవీ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొండా సురేఖ

ఎక్స్‌గ్రేషియా పెంపుపై తొలి సంతకం • 'హరితహారం' వివరాలు తెలుసుకున్న మంత్రి

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:



వన్యప్రాణుల దాడుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంచే ఫైల్‌పై మంత్రి కొండా సురేఖ తొలి సంతకం చేశారు. ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ మంత్రి సంతకం చేశారు. దీనిపై త్వరలో ఉత్తర్వులు జారీ కానున్నాయి. అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రిగా కొండా సురేఖ సచివాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. వివిధ కార్యక్రమాలు, ఉత్సవాలకు ఏనుగులను ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకునేందుకు అనుమతినిస్తూ మరో ఫైల్‌పై కూడా మంత్రి సంతకం చేశారు. ఆ తర్వాత అటవీ శాఖపై సమీక్ష నిర్వహించారు. హరితహారం ద్వారా ఇప్పటి వరకు పచ్చదనం పెంపు, వచ్చే ఏడాది లక్ష్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ, దేవాదాయ శాఖల్లో ప్రస్తుత సిబ్బంది, కొత్తగా నియామకాలకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. నిత్యం అందుబాటులో ఉంటానని, సిబ్బంది, అధికారులు నిజాయితీగా పనిచేయాలని సూచించారు. జట్టుగా పనిచేసి లక్ష్యాలు సాధిద్దామని.. పర్యావరణ రక్షణ, పచ్చదనం పెంపునకు అందరూ కార్యసాధకులుగా పనిచేయాలన్నారు. త్వరలోనే శాఖల వారీగా పూర్తి స్థాయి సమీక్షలు చేపడతామన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారు చేసిన పోస్టర్లను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు. కొండా సురేఖ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు, నేతలు, అటవీ, ఉన్నతాధికారులు, సిబ్బంది హాజరై అభినందనలు తెలిపారు.

# గెలుపు ఓటములు సహజం

- నేటి ఓటమి పాటాలు రేపటి గెలుపుకు బాటలు
- పదవి ఉన్న లేకున్నా పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు అండగా ఉంటా
- మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్



**మహబూబాబాద్, విశాల భారతి:**
కేసముద్రం మండల స్థాయి బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నేడు కేసముద్రం మండల కేంద్రంలోని భారస పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. గ్రామాల వారీగా పార్టీ పరిస్థితి ఎలా ఉంది భవిష్యత్ కార్యాచరణ మొదలగు అంశాలపై చర్చ చేయడం జరిగింది. గ్రామ స్థాయి లీడర్స్ మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకున్నారు. అంతే తప్ప సీఎం కెసిఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్ల వేళలా అండగా ఉండాలని వారికి సంక్షేమ పలాలు ప్రభుత్వ హామీలు అమలు పట్ల నిరంతరం పర్యవేక్షణ చేయాలని ప్రజల పక్షాన ఉంటు భవిష్యత్ కార్యాచరణ చేయాలని, నేను ఎప్పుడు పార్టీ కార్యకర్తలకు అండగా అందుబాటులో ఉంటానని మహబూబాబాద్ నియోజకవర్గంలోనే ఉంటా అని ప్రతి కార్యకర్త ఎల్ల వేళలా తనను కలవ వచ్చని అన్నారు.

# బీసీలకు రూ.6 లక్షల ఆర్థికసాయం అందించాలి

**బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ కన్వీనర్ ధనుంజయ నాయుడు**

**సూర్యాపేట, విశాలభారతి:**
తెలంగాణ శాసనసభలో ప్రసంగించిన గవర్నర్ తన ప్రసంగంలో ఇల్లు నిర్మించుకొనే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఆరు లక్షల ఆర్థిక సహాయం చేయనున్నట్లు మిగతా వారికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వనున్నట్లు శాసనసభ సాక్షిగా ప్రకటించారని బీసీ వర్గాల వారికి కూడా ఆరు లక్షల ఆర్థిక సహాయం రూపాయలు అందించాలని బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ కన్వీనర్ ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సూర్యాపేటలోని బీసీ భవన్ బి సి సంక్షేమ సంఘం ముఖ్య నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో గత పది సంవత్సరాలుగా అనేకమంది నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామన్న గత పాలకుల మాటలు విని నమ్మి మోసపోయి ఉన్నారని అన్నారు .ఇక ప్రజలకు వినే ఓపిక పోయిందని అందువల్లనే బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని అన్నారు. అందువల్ల కాంగ్రెస్ పార్టీ బాధ్యతాయుతంగా ప్రవర్తించి నిరుపేదలైన ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు 6 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. ప్రజలు కేసీఆర్ గారడి మాటలకు మోసపోయి ఎంతో నష్టపోయి ఉన్నారని అందుకే ఇటీవల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కడ గెలిచినా అత్యదిక ఓట్ల మెజారిటీతో శాసనసభ్యులు ఎన్నికయ్యారని ప్రజలు తమ కడుపు మంటను ఆ విధంగా తీర్చుకున్నారని పేర్కొన్నారు .అట్టి విషయాన్ని నేటి పాలకులు గమనం లో ఉంచుకొని ప్రజలకు సరైన న్యాయం చేయాలని ధనుంజయ నాయుడు కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి సుందరయ్య,నాయకులు యల్లబోయిన సింహాద్రిరావు, సత్యం,చిలక రాజు, శ్రీను, బెల్లంకొండ గోవిందు గౌడ్, తమ్మిశెట్టి రాజేష్,ఎస్కే.మదార్ పాల్గొన్నారు.



# రుగ్మతలను నివారించాలి

**డాక్టర్ సిహెచ్ దేవి రెడ్డి**



**మహబూబాబాద్, విశాల భారతి:**
ఉషోదయ వాకర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అసోసియేషన్ అధ్యక్షులు పాలబిందల మల్లయ్య అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సిహెచ్ దేవి రెడ్డి మాట్లాడుతూ.. ఉదయం నడక ఆరోగ్యానికి చాలా మంచిదని ప్రతి ఒక్కరూ సమయాన్ని కల్పించుకొని వాకింగ్ చేయాలని, వాకింగ్ చేయడంతో పాటు ఉషోదయ వాకర్సు సంస్థ సమాజంలోని రుగ్మతలను కొన్నింటిని నివారించడానికి ప్రయత్నించాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుటకు ఆరోగ్యాన్ని పెంపొందించుటకు తరచుగా గ్రామాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ హెల్త్ క్యాంపుల నిర్వహణకు డాక్టర్ గా తన సేవలను అందిస్తానని హామీ ఇచ్చారు. ఇక ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆకుల సెంబయ్య గారు తన వార్షిక నివేదికను కోశాధికారి తండ సదానందం తన ఆర్థిక నివేదికను ప్రవేశ పెట్టడం జరిగింది. 2023 సంవత్సరానికి తను వాకింగ్ చేస్తూ ఇతరులను ప్రేరేపిస్తున్న ఉత్తమ వాకర్ గా కే అశోక్ కుమార్ ను అభినందించడం జరిగింది. అదేవిధంగా సంస్థ అభివృద్ధికి అవిరాల కృషి చేస్తున్న వాకర్స్ ను కూడా సన్మానించడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు భువనగిరి రవీంద్ర గుప్తా ప్రధాన కార్యదర్శి ఆకుల సాంబయ్య కోశాధికారి తండ సదానందం, నల్ల సుధాకర్ రెడ్డి , సోమ గోవర్ధన్, ఇమ్మడి కృష్ణమూర్తి, దాసరి ప్రసాద్, కాపర బోయిన శ్రీనివాస్, బొడ్డు పెల్లి ఉపేంద్రం, సాదు మైపాల్ రెడ్డి కళ్లెం వీరారెడ్డి, నల్ల వేణు, ఎస్ పరంధామయ్య, టి లక్ష్మయ్య, శేఖర్, నక్క నాగార్జున, కన్నా అశోక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి శరవేగంగా బాటలు పడతాయి

- ప్రభుత్వ విప్ గా డోర్నకల్ ఎమ్మెల్యే
- శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు లూనావత్ విజయ్ నాయక్





**మహబూబాబాద్, విశాల భారతి:**
నియోజవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్ కు మంత్రి రేవంత్ రెడ్డి నలుగురికి ప్రభుత్వ విప్ ఓదా కల్పించగా దాంట్లో డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ కి దక్కడం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆనందాన్ని నింపిందని కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు లూనావత్విజయ్ నాయక్ తో పాటు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు హర్షం వ్యక్తం చేశారు. డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి శరవేగంగా బాటలు పడతాయని అన్నారు. సహకరించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి

**కోదాడ పట్టణ సిఐ రాము**

**కోదాడ, విశాల భారతి:**
విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని కోదాడ పట్టణ సీఐ రాము విద్యార్థులకు పిలుపునిచ్చారు. కోదాడ పట్టణంలోని ఎన్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో కోదాడ నియోజకవర్గంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పట్టణ సీఐ రాము పరీక్ష పత్రాన్ని విడుదల చేసి విద్యార్థులకు అంద చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని దాని ద్వారా వారి తల్లిదండ్రులకు, చదువు నేర్పిన గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. దేశాభివృద్ధిలో సైతం పాల్గొనాలని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ లు మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత సమాజంలో విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న మంచి చెడుల గురించి అధ్యయనం చేయాలని మంచి బాటలో పయనించి దేశ భవిష్యత్తును కాపాడాలని అన్నారు. ఈ టాలెంట్ టెస్టులో 736 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. ఇలాంటి టాలెంట్ టెస్టులో తమ ప్రతిభను చాటుకుని మరింత అభివృద్ధి చెందాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, అనిల్, మామిడి రామారావు, ఎన్ఆర్ఎస్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేటలో పర్యటించిన జగదీష్ రెడ్డి

- పలు వివాహ వేడుకలకు హాజరు
- శతమానం భవతి అంటూ నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి

**సూర్యాపేట, విశాలభారతి:**
మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదివారం సూర్యాపేట నియోజక వర్గంలో పర్యటించారు. పలు వివాహ వేడుకలకు హాజరైన ఆయన "శతంమానం భవతి" అంటూ నూతన వదూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలకు వెళ్లిన సందర్భంగా వేడుకలకు వచ్చిన వదూవరుల బందువులను ఆప్యాయంగా పలకరించిన శాసనసభ్యులు ,వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట బిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.



# విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- నకారా సేవలు చిరస్మరణీయం
- విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య

**కోదాడ, విశాల భారతి:**
విశ్రాంత ఉద్యోగులు సమాజంలో ఉన్నత స్థానాన్ని గౌరవంగా జీవించేందుకు నకారా చేసిన కృషి చిరస్మరణీయమని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య అన్నారు. ఆదివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా సంఘ సభ్యులు అందరితో కలిసి నకారా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ సుదీర్ఘకాలం ప్రభుత్వానికి సేవలందించి వారికి పెన్షన్ లేకపోవడం సరికాదని భావించి తన కర్తవ్యంగా బాధ్యతగా న్యాయస్థానానికి వెళ్లి పెన్షన్ తీసుకువచ్చేందుకు నకార చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. కొత్తగా ఏర్పాటు అయిన ప్రభుత్వం పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, సెక్రటరీ బొల్లు రాంబాబు, కోదాడ ఉపాధ్యక్షులు వెంకటేశ్వరావు, సెక్రటరీ యర్రంశెట్టి లక్ష్మినరసయ్య, వరప్రసాద్, భ్రమరాంబ, శోభా రాణి, కార్యవర్గ సభ్యులు, పెన్షనర్స్ పాల్గొన్నారు.

# స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరికి కలగాలి

**గుంటకండ్ల జగదీష్ రెడ్డి**

**దాస్ తండాలో కన్నుల పండువగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ**

**సూర్యాపేట, విశాలభారతి:**
ఆంజనేయ స్వామి అనుగ్రహంతో గ్రామం పచ్చగా ఉండాలని ప్రతి కుటుంబం చల్లగా ఉండాలని సూర్యాపేట శాసన సభ్యులు, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం సూర్యాపేట రూరల్ మండలం దాస్ తండా లో నూతన ఆంజనేయ స్వామీ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం లో పాల్గొన్న శాసన సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట అభివృద్ధి ప్రదాత కు మహిళలు, అవ్వలు, చిన్నారులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట



ఎంపిపి బీరవోలు రవీందర్ రెడ్డి,జడ్పీటిసి జీడి బిక్షం, బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పులగం రాఘవ రెడ్డి, మోతీలాల్, తండా వాసులు,తదితరులు పాల్గొన్నారు.

# ఫాసిజాన్ని ఐక్యంగా అడ్డుకుందాం

**మూడు విప్లవ పార్టీల విలీన మహాసభను విజయవంతం చేయండి**




**సూర్యాపేట, విశాలభారతి:**
దేశ లౌకిక వ్యవస్థ, ప్రజల ప్రజాస్వామిక హక్కులకు ప్రమాదకరంగా మారుతున్న మతోన్మాద ఫాసిజాన్ని ప్రజలు,ప్రజాస్వామిక వాదులు విప్లవకార్లంతా ఐక్యంగా అడ్డుకోవాలని సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు గోకినపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మార్చి3,4,5న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించే పీసీసీ సీపీఐ(ఎం.ఎల్ ), సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎం.ఎల్) రివల్యూషనరీ ఇనిషియేటివ్ మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభ సందర్భంగా ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ విక్రమ్ భవన్ లో పార్టీ జిల్లా నాయకులు పేర్ల నాగయ్య అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కామ్రేడ్ గోకినపల్లి వెంకటేశ్వరరావు,పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ లు పాల్గొని మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశసంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని,అంబానీ లాంటి కార్పొరేట్ పెట్టుబడిదారీ శక్తులకు అప్పనంగా కట్టబెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలో రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను,ప్రశ్నించే గొంతుకులను నిరంకుశంగా అనిచివేస్తూ, భిన్నత్వంలో ఏకత్వంల కలిసిమెలిసి జీవిస్తున్నా దేశ ప్రజల మధ్య కుల,మత విభేదాలు సృష్టిస్తూ పాలన కొనసాగిస్తున్నాడని విమర్శించారు. అదేవిధంగా బిజెపి పాలనలో స్త్రీలకు రక్షణ కరువైందని, మణిపూర్లో మతోన్మాదులు మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ ఆనందాన్ని పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిత్యం ఏదో ఒక చోట మహిళలు హత్యలు, అత్యాచారాలకు గురవుతున్న అరికట్టడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా దేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిజాన్ని అందరం ఐక్యంగా అడ్డుకోవాలని అన్నారు.



# ప్రారంభమైన ధనుర్మాస మహోత్సవాలు

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నుండి ధనుర్మాస వ్రత మహోత్సవములు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుఝామున స్వామివారికి సుప్రభాత సేవతో ప్రారంభమైన ఉత్సవములు ఆండాళ్ గోష్ఠి మహిళా భక్తులు మంగళహారతులతో దేవాలయమునకు చేరుకొని గోదా శ్రీనివాస స్వామి అష్టోత్తర శతనామాలు పాటించి గోదాదేవి పాడిన 30 పాటలు తిరుప్పావై చదివారు. శ్రీ వెంకటేశ్వర స్వామి గోదాదేవిల భజనలు చేస్తూ తన్మయత్వం పొందారు పూజల అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం జరిపారు ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ధనుర్మాస వైభవాన్ని తిరుప్పావై లోని మొదటి పాశుర అర్థాన్ని భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వై. శ్రీనివాసరెడ్డి, రవీందర్,కరుణాసాగర్ రెడ్డి, మంజుల, జ్యోతి, జ్ఞానకుమారి, తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

**పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి**



**తొర్రూర్ ,విశాల భారతి:**

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూర్ పట్టణం కేంద్రంలోని నేమురుగొమ్ముల యతి రాజారావుపార్కులో బేస్ బాల్ క్రీడలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని తల్లిదండ్రులు కూడా సహకరించాలని అన్నారు.క్రీడల ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని ఉన్నత విద్యలో రిజర్వేషన్లు పొందే అవకాశం ఉంటుందన్నారు. క్రీడా పోటీల నిర్వహణకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రభుత్వం తరపున కూడా క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. నేను కూడా స్కూల్ లో ఉన్నప్పుడు రన్నింగ్ లో ఫస్ట్ ఉండేదాన్ని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తూ చదువులో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మహబూబాబాద్ జిల్లా సెక్రెటరీ జ్యోతి,రాష్ట్ర పరిశీలకులు గంగా మోహన్ పిఏసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# మధు మిశ్రాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**భద్రాచలం, విశాల భారతి:**



బూట్లు పాలిష్ చేసినోళ్లు పాలిస్తున్నారని అనుచిత వ్యాఖ్యలను చేసిన బిజెపి మహిళా విభాగం చీఫ్ మధు మిశ్రా పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ ఎస్టీ లాయర్స్ అసోసియేషన్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ అవులూరి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటిన దళితుల పట్ల వివక్షత కొనసాగుతా ఉందని దళితులు ఎప్పటికీ రాజకీయ బానిసలుగా వాళ్లకు జెండాలు మోసి దండాలు పెట్టి కుర్చీలు వేసి బాంచన్ దొర అని బ్రతికే వాళ్ళగానే చూస్తున్నారని దళితులను రాజకీయ కూలీలుగాచూస్తున్నారు. తప్ప సమానత్వం ఎక్కడ కనిపించట్లేదని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. అంబేద్కర్ రిజర్వేషన్లు కూడా ఆమె ఎగతాళి చేస్తుందని ఆ రిజర్వేషన్లు లేకుంటే దళితులను ఇంకా అనగదొక్కే వారని ఆయన పేర్కొన్నారు ఎన్నికల కమిషనర్ మధు మిస్రాను ఎన్నికల్లో పోటీ చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. బిజెపి పార్టీ ఇప్పటికే ఆమెను ఏడు సంవత్సరాలు సస్పెండ్ చేశారని ఆమె అహంకారానికి వివక్షత ధోరణికి ఏడు సంవత్సరాలు సరిపోదని పార్టీ నుండి సస్పెండ్ చేసి రాజకీయాలకు అనాహరులుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. దళితుల పట్ల ప్రేమ ఉన్నట్లు మొసలి కన్నీరు కారుస్తున్నారనిబిజెపికి మద్దతిచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆమె వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని ఇటువంటి పార్టీలకు మద్దతు ఇచ్చి తప్పు చేస్తున్నారని ఆయన తెలిపారు. దళిత వ్యతిరేక పార్టీలను నమ్మరాదని హితవు పలికారు మధు మిశ్రాపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నమోదు చేయాలని లేకుంటే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రకటన జారీ చేసిన వారిలో ప్రముఖ న్యాయవాది అద్దూరి రజిని తదితరులు ఉన్నారు.

# అభివృద్ధికి పాటుపడాలి

**డాక్టర్ ఆదర్శ కుమార్**

**మిర్యాలగూడ- విశాలభారతి:**



ప్రతి ఒక్కరూ పరమత సహనం పాటిస్తూ దేశ సమగ్ర, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పాటు పడాలని డాక్టర్ ఆదర్శ కుమార్ అన్నారు. మిర్యాలగూడ పట్టణ కేంద్రానికి చెందిన ఎం.డి జునేద్ ప్రతి ఏటా అయ్యప్ప, ఆంజనేయ భక్తులకు అన్నదానం చేసేవారన్నారు. ఈ క్రమంలో అతను ఇటీవల భౌతికంగా దూరమైనప్పటికి జునేద్ సేవలను గుర్తు చేసుకుంటూ పురం వెంకట్, గాయాస్, చంటి, నాగేందర్ ఇతరులతో కలిసి ఆదివారం స్థానిక ఎం.ఎన్ ఫంక్షన్ హాల్లో సుమారు 300 మంది అయ్యప్ప, ఇతర భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదర్శ కుమార్ మాట్లాడారు. భిన్న మతాల సమ్మేళనం. ఏకత్వ జీవన విధానాలకు నిలయమైన దేశంలో ప్రాచీన సంస్కృతిని కాపాడాలని కోరారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అమాన్, నఆమీర్, మునీర్,అక్బర్, గౌస్, ఇమ్రాన్,బంటు రాము తదితరులున్నారు.



# విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రామన్నపేట, విశాల భారతి:**

పట్టణ కేంద్రంలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా 18 వ తేది నుండి 21 తేది వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పట్టణ కేంద్రంతో పాటు నీర్నెంల ఫీడర్ కు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

# ముక్కోటి ఉత్సవాలు ఘనంగా జరగాలి

**జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా**



**భద్రాచలం, విశాల భారతి:**

ముక్కోటి మహోత్సవాలకు భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. ఆదివారం దేవాలయం వద్ద ముక్కోటి మహోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలం విచ్చేయభక్తుల సౌకర్యార్థం టికెట్లు ఆన్లైన్ ద్వారా విక్రయిస్తున్నట్లు చెప్పారు. భక్తులు వచ్చినట్లు ఆన్లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని ఆమె సూచించారు. 22న గోదావరిలో జరిగే స్వామి వారి తెప్పోత్సవం, 23న జరుగు స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెక్టార్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి సెక్టారులో ఏర్పాట్లు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. భక్తుల రద్దీ దృష్ట్యా రోడ్లపైకి వచ్చిన దుకాణాలను తొలగించాలని ఆమె సూచించారు.

# హామీల అమలును వేగవంతం చేయాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి**



**మిర్యాలగూడ, విశాలభారతి:**

ఇటీవల ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలును వేగవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. దామరచర్ల మండల కేంద్రంలో పార్టీ మీటింగ్ లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ప్రజా ఉద్యమాలకు కొనసాగిస్తామన్నారు. శాసనసభల్లో ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి తీసుకునే నిర్ణయాలపై చర్చ జరగాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి వినోద్ నాయక్, దయానంద్ ,ఎర్రనాయక్, ఖాజా మొయినుద్దిన్ ,శ్రీహరి పాల్గొన్నారు.



# బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నాగార్జున రెడ్డి

**బాల్కొండ, విశాల భారతి:**

భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా బాల్కొండ నియోజకవర్గం భీమ్గల్ మండలం మెండోర గ్రామానికి చెందిన నాగార్జున రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ పదవిని పదవిగా కాకుండా బాధ్యతలాగా స్వీకరించి రాబోయే కాలంలో స్థానిక సంస్థల్లో అలాగే పార్లమెంటు ఎన్నికలలో తన శక్తి మేరకు పార్టీ బలోపేతం కోసం పని చేస్తానని తెలిపారు. జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినందకు పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షుడు బసవ లక్ష్మీ నర్సయ్య, మాజీ జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్ రెడ్డి, అన్నపూర్ణమ్మ,పల్లె గంగారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి అండగా..!

**కాంగ్రెస్ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



**మిర్యాలగూడ, విశాలభారతి:**

ఇటీవల నల్గొండ జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన మిర్యాలగూడ మండలం ఆలగడప వాసి కానిస్టేబుల్ ధర్మవరపు శ్రీకాంత్ ఫ్యామిలీకి అండగా ఉంటామని కాంగ్రెస్ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆలగడపకు చేరుకొని కానిస్టేబుల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కానిస్టేబుల్ సతీమణికి జాబ్ వచ్చే విధంగా పై అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు.



# బారసాల వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి**

**మోతె, విశాల భారతి:**

మోతె మండల పరిధిలోని విబులాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపాటి మల్లారెడ్డి మనవడి బారసాల మహోత్సవ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించిన. మోతె కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు మైనం పాటి వీరారెడ్డి, గుండ్ల లక్ష్మారెడ్డి , కర్ణాకర్ రెడ్డి, ఉప్పల ఉపేందర్, నిమ్మల శ్రీనివాస్, జంపాల రమేష్, సామీ రెడ్డి నవీన్ రెడ్డి, రాం రెడ్డి, నాగిరెడ్డి, పార్టీ కార్యకర్తలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడో?

**పదేళ్లుగా జారిచేయని ప్రభుత్వం • కొత్త ప్రభుత్వంపైనే ఆశలు**

**భీమదేవరపల్లి, విశాల భారతి:**



రేషన్ కార్డు అందని ద్రాక్షగా మారింది. దరఖాస్తు చేయడం, పిర్యాదు చేయడం, ఆపై కార్యాలయాల చుట్టు తిరిగి నిరాశగా వెనుదిరిగిపోవడం తంతుగా మారింది. బోగస్ కార్డులు ఏరివేసేందుకు 2019లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడంతో అప్పటి నుంచి కొత్త కార్డుల జారికి బ్రేక్ వేసింది. అప్పటి నుంచి కొత్త కార్డులకు మోక్షం లేకపోగా కొత్తగా పెళ్లిన వారు, సంతానం కలిగిన వారికి నిరీక్షణ అనివార్యమవుతోంది. కొత్త ప్రభుత్వంలోనైనా త్వరగా కార్డులు వస్తాయని లబ్దిదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**కొత్త ప్రభుత్వంపైనే ఆశలు:**

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో నూతన రేషన్ కార్డులపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ముద్రించి ఇవ్వలేదు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సందర్భంలోనే రేషన్ కార్డులు ఇచ్చింది. హుజరాబాద్ ఉప ఎన్నికల సమయంలో అప్పటికే అన్లైన్లో దరఖాస్తు చేసుకున్న కొంతమందికి మాత్రమే ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఇచ్చింది. ఆ తరువాత రేషన్ కార్డులు పట్టించుకున్న పాపాన పోలేదు.

# అయ్యప్పలకు అన్నదానం

**జిల్లా మైనార్టీ నాయకుడు బిఆర్ఎస్ జాయింట్ సెక్రటరీ షకీల్**

**కన్నుల పండుగగా అయ్యప్ప స్వామి పూజ కార్యక్రమం**



**సూర్యాపేట, విశాలభారతి:**

పట్టణంలోని 20వ వార్డులో అయ్యప్ప మాల ధరించిన సుమారు వందమంది స్వాములతో పట్టణ టిఆర్ఎస్ కార్యదర్శి షకీల్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు అన్ని రకాల వంటకాలతో అన్నదాన వితరణ గావించారు. ఈ సందర్భంగా పలువురు మాలధారణ స్వాములు మాట్లాడుతూ పరమ పవిత్రమైన అయ్యప్ప మాలను ధరించిన స్వాములకు ఒక రోజు అన్నదానం చేసిన ఎంతో ఫలితం లభిస్తుందన్నారు. మత మతసామరస్యాన్ని చాటి చెబుతూ అయ్యప్ప మాల ధరించిన స్వాములకు మైనార్టీ నాయకులు షకీల్ అన్నదాన వితరణ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు అరిగే శ్రీనివాస్, మతకాల చలపతి రావు, కుంబం నాగరాజు, రామగిరి లక్ష్మణ్, బాల స్వామి, ఉపేందర్ తో పాటు పలువురు మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడవాలి

**మునగాల, విశాల భారతి:**



మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం చేపట్టిన ఉచిత బస్సు ప్రయాణం ప్రతి గ్రామాల్లో విద్యార్థినీ విద్యార్థులకు, మహిళలకు, ప్రజలకు బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బంది పడుతున్నారని తక్షణమే ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకాన్ని తక్షణమే అమలు చేసి పల్లెటూర్లలో మహిళలు ఆదుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి నందిగామ సైదులు, మాజీ సర్పంచ్ రావులపెంట వెంకన్న, ఉపసర్పంచ్ రావులపెంట బ్రహ్మం, సింగిల్ విండో డైరెక్టర్ నిడిగొండ శంబయ్య, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు వట్టెపు చిన్న సైదులు, ములకలపల్లి సైదులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం...!

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**మిర్యాలగూడ, విశాలభారతి:**


మిర్యాలగూడ హౌసింగ్ ఇక్కడి అంగన్వాడీ టీచర్స్, వెల్ఫేర్స్ అసోసియేషన్ నేతలు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్ల, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# వైభవంగా ధనుర్మాస పూజలు



**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండలంలోని ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు ఆలయ ఈవో పి. కిషన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానంలో సనాతన ఆచారంగా పూజ కొనసాగించే విధానాన్ని కొత్తకొండ వీరన్న నిలబెట్టే పూజను సేవా గమన ప్రకారంగా పుణ్యవచనం గణపతి పూజ గురిగిలో బియ్యం పోసి శాస్త్రఒత్తంగా నిలబెట్టే పూజా విధానం చేశారు. జనవరి మాసంలో వచ్చే సంక్రాంతి బ్రహ్మోత్సవాల లగ్న పత్రికను కొత్తకొండ దేవాలయ అర్చకులు లగ్నపత్రికను ఆలయ ఈవో పి. కిషన్ రావుకు అందజేసి ఘనంగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు కే.రాజయ్య, ముఖ్య అర్చకులు సదానందం, రాంబాబు, అర్చకులు వీరభద్రయ్య, శ్రీకాంత్, రమేష్, శివకుమార్, శరత్ చంద్ర ,పరిచారిక గురు ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



**మందమర్రి టౌన్, విశాల భారతి:** సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం మందమర్రికి విచ్చేసిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావుకు సిఐటియు నాయకులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్సికేఎస్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో వివిధ విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందనీ అన్నారు. 2006 నుంచి కనీస వేతనాల జీవోలు అమలు కాకపోవడంతో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2021 జూన్ లో ఐదు కనీస వేతనాలు జీవోలను విడుదల చేసినప్పటికి, కార్పొరేట్లకు నష్టం వాటిల్లుతుందని గ్రహించి జీవో గెజిట్ చేయకుండా పక్కన పెట్టిందనీ, దాని వలన కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరగకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగానే వేతనాలు ఉన్నాయనీ అన్నారు. ఈ ప్రభుత్వం ఐన కార్మికుల వేతనాలు పెంచడంలో, ఇతర హక్కులను అమలు పరచడంలో ముందుకు వచ్చి కార్మికులకు అండగా నిలవాలని కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో అంకుస్, నాగరాజు, అనిల్, రంజిత్, ఐలన్న, సాయి, దేవేందర్, మహేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## చైర్మన్ పదవి శ్రీనివాస్ రెడ్డికి
# కేటాయించాలి

### మంత్రి పొన్నంని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**భీమదేవరపల్లి, విశాల భారతి:** ప్రముఖ పుణ్యక్షేత్రం కొత్తకొండ వీరన్న ఆలయ ఛైర్మన్ పదవి దక్కించుకునేందుకు పెద్దసంఖ్యలో ఆశావహులు పోటీలో ఉన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రానికి చెందిన మార్పాటి శ్రీనివాస్ రెడ్డి, సహచర మండల కాంగ్రెస్ నేతలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసారు. ఈ సందర్భంగా కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి అంశాన్ని చర్చించారు. జనవరి నెలలో ఆలయంలో జాతర బ్రహ్మోత్సవాల ఉన్నందున ఆలయ కమిటీ త్వరితగతిన నియమించాలని సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మార్పాటి శ్రీనివాస్ రెడ్డి పేరును నేతలు సూచించగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు డబ్బా శంకర్, మాచర్ల సదానందం, మాచర్ల కుమారస్వామి, కుమారస్వామి, తాళ్లపల్లి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.




# నలుమూలలకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

**మందమర్రి టౌన్, విశాల భారతి:** వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మందమర్రి మండలంలోకొనసాగుతోంది. ప్రతి మారుమూల ప్రాంతానికి యాత్ర చేరాలని నరేంద్ర మోధి ఆకాంక్షించిన మేరకు మందమర్రి ప్రభుత్వ వైద్యాధికారులు ఆధ్వర్యంలో మందమర్రి మండలంలోని పులిమడుగు, ఆందుగులపేటలో మోదీ గ్యారెంటీ వెహికల్ యాత్ర ఆదివారం కొనసాగింది. నిర్దిష్ట కాలవ్యవధిలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులందరికీ చేరాలనే సంకల్పంతో వికసిత్ సంకల్ప్ యాత్ర మందమర్రి మండలంలో కొనసాగుతుంది. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా చేపడుతున్న ఈ కార్యక్రమం జనవరి 26వ తారీకు వరకు కొనసాగనుంది. నవభారత నిర్మాణంలో అమృతకాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఔన్నత్యంపై ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా అందించిన సందేశాన్ని గ్రామ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# కామ్రేడ్ వి బి రమాదేవి సంతాప సభ




**మేడిపల్లి, విశాల భారతి:** మండలంలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మల్లికార్జున్ నగర్ కాలనీలో సిపిఐ పార్టీ మాజీ కార్యదర్శి వి బి బాలరాజ్ సతీమణి పీర్జాదిగూడ గ్రామపంచాయతీ మాజీ వార్డ్ సభ్యురాలు వి.బి రమాదేవి గారి సంతాప సభ ఉప్పల్ బస్ డిపో ఎదురుగా ఉన్న వారి సొంత ఇంటి దగ్గర నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి డి జి సాయిల్ గౌడ్ పాల్గొన్నారు. సాయిల్ గౌడ్ మాట్లాడుతూ కామ్రేడ్ రమాదేవి మరణం పార్టీకి తీరని లోటు అని ఒక మంచి నాయకురాలునీ కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

### ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకులు నీలం మధు

### చిట్కుల్ లో ఘనంగా మల్లన్న స్వామి జాతర



**పటాన్ చెరు-, విశాలభారతి :** మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సల్లగా ఉండాలని చిట్కుల్ సర్పంచ్, ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం తన స్వగ్రామం చిట్కుల్ గ్రామంలో మాజీ సర్పంచ్ రాములు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మల్లన్న స్వామి జాతరలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ గ్రామాలలో నిర్వహించే జాతరలు ఉత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు గ్రామస్థుల మధ్య ఐక్యమత్యం వెల్లివిరుస్తుందని తెలిపారు. అనాదిగా వస్తున్న మన ఉత్సవాలను, జాతరాలను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. మలన్న స్వామి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని ఆ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కృష్ణ, మురళి, రాజ్ కుమార్, నర్సింగ్ యాదవ్, నాయకులు చాకలి వెంకటేశ్, గోపాల్, శ్రీను, శ్రీశైలం, గ్రామ పెద్దలు, ప్రజలు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దంపతులకు సన్మానం



**నారాయణఖేడ్, విశాల భారతి:** నారాయణఖేడ్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత నారాయణఖేడ్ లోని విశ్వేశ్వర కాలనీకి ఖేడ్ ఎమ్మెల్యే పట్లోల సంజీవరెడ్డి దంపతులు కాలనీ రవడంతో కాలనీవాసులు సన్మానించారు.

# జననేతకు శుభాకాంక్షల వెల్లువ



**ఉప్పల్ , విశాల భారతి:** సైనిక్ పూరి లోని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు అధికారులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేసే నాయకుడికి ప్రజలు ఎప్పుడూ మద్ధతు ఉంటుందని నా విజయంతో మరోమారు నిరూపితమైందన్నారు. మీ ప్రేమ, అభిమానాలు నాపై ఎప్పుడూ ఎలాగే ఉండి నాకు మద్దతుగా నిలవాలన్నారు.

# మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు పరామర్శ



**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండలంలోని వంగర గ్రామం కాశి కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఎస్.కె హుస్సేన్ గత మూడు రోజుల క్రితం మృతి చెందగా మంత్రి పొన్నం ఆదేశాల మేరకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు మృతుని కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. అనంతరం కుటుంబానికి బియ్యం నిత్యావసర వస్తువులు అందించారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇందులో గోలుగురి రాజు, ఆదరి రవీందర్, డా.ఏలాపురం తిరుపతి గుడి కందుల రాజు, షేక్ మౌలానా పాల్గొన్నారు.



# యాదిరెడ్డి మృతి తీరని లోటు

### బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

**కూకట్ పల్లి,విశాలభారతి:** సోమనాగుర్తి యాదిరెడ్డి ఓ మంచి నిష్ణాతుడు, క్రమశిక్షణ మరియు ప్రేరణ కలిగిన వ్యక్తిగా రోజు ఎంత అద్భుతంగా, స్ఫూర్తిదాయకంగా ఉండే చాలా చిన్న వయస్సులోనే మరణించడం, ఆయన మరణ వార్త ఏంతో కాల్చివేసిందని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆదివారం తెలంగాణ గార్డెన్స్ లో జరిగిన సంతాప సభలో ఆయన లేని లోటును పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక స్నేహమిత్ర మిత్రమాండాలి సంతాప సభ కార్పొరేటర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా యాదిరెడ్డి చిత్రపటానికి స్నేహమిత్ర మిత్రమాండాలి సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేటర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అందరి శ్రేయస్సు కొరకు పని చేసిన మనిషిగా యాదిరెడ్డి జీవితం సాగిందన్నారు. ఆయన మరణంతో స్నేహమిత్ర మిత్రమండలి పెద్దదిక్కుని కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే నివాళులని తెలిపారు.

# డ్రగ్స్ పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి

### హెల్తీ ఇండియా ఆర్గనైజేషన్ ఫౌండర్ గుంటి నరేందర్



**కొందుర్గు, విశాలభారతి:** మాదక ద్రవ్యాలయిన డ్రగ్స్,గంజాయిలకు అలవాటు పడిన యువత జీవితంలో అన్నీ కోల్పోవాల్సి వస్తుందని అలాంటి పరిస్థితి కొందుర్గు పరిధిలో రాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని హెల్త్ ఇండియా ఆర్గనైజేషన్ ఫౌండర్ గుంటి నరేందర్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచానికే పట్టుకొమ్మలు యువత అంటూ చాలా సార్లు ఎన్నో సందర్భాల్లో వింటుంటాం కానీ దానికి భిన్నంగా కొన్ని పరిస్థితులు చూస్తుంటే కనిపిస్తాయి. చదువుకోవాల్సిన వయస్సులో యువకులు తప్పుదోవ పడుతున్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలో యువత మత్తుకు అలవాటు పడి చిన్నవయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారు. దానితో కుటుంభం మొత్తం దిక్కుతోచని స్థితిలో ఉండిపోయాయి. షాద్ నగర్ చుట్టూ ప్రాంతాల్లో ఉన్న కంపెనీల్లో పనిచేసే ఇతర రాష్ట్రాల వ్యక్తులు గంజాయి సేవిస్తుంటారు. వాటిని అదునుగా చేసుకొని కొంతమంది తమ తమ వ్యాపారం కోసం అమ్ముతూ యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్నారు. కావున అధికారులు మత్తు పదార్థాలను సప్లయ్ చేస్తున్న ముఠాలపై ఉక్కు పాదం మోపాలని దానితోపాటు వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మున్ముందు వీటిపై అవగాహన కార్యక్రమాలు కూడా హెల్త్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు.

# ఎమ్మెల్యేను సన్మానించిన మైనార్టీలు




**నారాయణఖేడ్, విశాల భారతి:** నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేష్ శెట్కార్ నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్ లో మైనారిటీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన పట్లోళ్ల సంజీవ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణఖేడ్ ప్రాంతంలో హిందువులు, ముస్లింలు కలిసిమెలిసి ఉంటారన్నారు. నారాయణఖేడ్ పట్టణంలో మైనార్టీలకు మైనార్టీ కార్పొరేషన్ లోన్లు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని.. మైనారిటీలను అన్ని విధాల తమ ప్రభుత్వం ఆదుకుంటుందని నారాయణఖేడ్ పట్టణంలో గల మైనార్టీ స్కూళ్లలో కూడా ఉపాధ్యాయుల నియమకాలు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ సర్పంచ్ అప్పారావు శెట్కార్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, రషీద్, తయర్, మైనుద్దీన్, ముంతాజ్ వాజిద్, నజీర్, యూసుఫ్, షారుక్ నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ముస్లిం మైనార్టీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877